మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


బసంత్ అపార్ట్‌మెంట్స్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

కాచిగూడ: నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. కాచిగూడ డివిజన్ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం బసంత్ అపార్ట్‌మెంట్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కేంద్రంలో అధికారంలో వచ్చేస్కారం లేదని, ఈ రెండు పార్టీలకు ఓటు వేస్తే గంగలో వేసినట్టేనని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఏం కావాలో నేరుగా నరేంద్రమోదీని కలిసి అడిగే సత్తా తనకు ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. దేశంలో సుపరిపాలన ఉండాలంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, ఎక్కాల కన్నా, ఎ.సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, హజారిబాబు, బల్వీర్, శీర్‌సాగర్, కృష్ణకుమార్, సచిన్ పరషార్, రాజశేఖర్, జాషువా, గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

సాహిత్యంపై మరిన్ని పరిశోధనలు అవసరం

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో ఉగాది కవిసమ్మేళనం


శ్రీమాన్ నాగరాజు సరేంద్ర ఎలనాగను సన్మానిస్తున్న అశ్వాపురం వేణుమాధవ్

నల్లకుంట: కవులు, కళాకారులు, సాహిత్యవేత్తలకు తెలంగాణ పుట్టినిల్లు అని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. సాహిత్యంపై మరిన్ని పరిశోధనలు అవసరమని, ఆ దిశగా సాహితీవేత్తలు కృషి చేయాలని కోరారు. చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట నర్మదా భవన్‌లో గల శ్రీ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో 'అభినందన సభ- శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం'జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన అశ్వాపురం వేణుమాధవ్ పలువురు కవులు, సాహితీవేత్తలను సన్మానించి మాట్లాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద విభాగం అవార్డు గ్రహీత డాక్టర్ శ్రీమాన్ నాగరాజు సరేంద్ర(ఎలనాగ)ను జ్ఞాపిక, శాలువాతో ప్రత్యేకంగా సన్మానించారు.అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కవి సమ్మేళనంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తులసి సత్యనారాయణ, బిక్కుమల్ల నిర్మల, ప్రధాన కార్యదర్శి వెంకటయోగి వెంటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి తిరుక్కవల్లూరు కృష్ణస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి పరివేద వెంకటేశ్వర రావు, ప్రచార కార్యదర్శి తిరునగరి విష్ణు, సలహాదారు బిక్కుమల్ల మనోహర్ స్వామి, ఆడిటర్ గజ్వేల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కనీస వేతనాలను అమలు చేయాలి

బీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబు


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబుయాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో కార్మికులకు కనీసవేతనాలను అమలు చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికచట్టాలను అమలు చేయకుండా నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మేడే ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులకు బీజేపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాల సలహామండలి మాజీ చైర్మన్ పి.నారాయణ, బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య తదితరులు పాల్గొన్నారు.

బెనిఫిట్స్ ఇవ్వకుండా వీఎస్‌టీ తరలింపు అన్యాయం

కంపెనీ గేటు వద్ద కార్మికుల ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ముషీరాబాద్: వీఎస్‌టీ కార్మికులు నిరసనబాట పట్టారు. తమకు ఎలాంటి బెనిఫిట్స్, ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా తుఫ్రాన్‌కు కంపెనీని తరలించడం అన్యాయమని ధ్వజమెత్తారు. సోమవారం వీఎస్‌టీ వర్కర్స్ ఏఐటీయూసీ విభాగం కార్మిక నాయకులు కె.రాజు, ఎల్.డి.పాల్ ఆధ్వర్యంలో ఆజమాబాద్‌లోని వీఎస్‌టీ కంపెనీ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ యాజమాన్యం, యూనియన్ కుమ్మక్కై కార్మిక చట్టాలకు విరుద్ధంగా కంపెనీనిని తుఫ్రాన్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. దీంతో కార్మికులు నిత్యం 100 కిలోమీటర్ల దూరం వెళ్లి రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ తరలించిన నేపథ్యంలో రెండు లక్షల రూపాయల నగదు బెనిఫిట్ ఇవ్వాలని, ఆరు ఇంక్రిమెంట్స్ కల్పించాలని, కార్మికులు వెళ్లి రావడానికి ఏసీ ఓల్వో బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలంలో సాధారణ బస్సులలో వెళ్లి రావాలంటే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కంపెనీ యాజమాన్యం కార్మికుల న్యాయమైన డిమాండ్లను యూనియన్ పట్టించుకోకపోతే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో వీఎస్‌టీ కార్మిక నాయకులు నాగేష్, సమ్మద్, ప్రవీణ్‌కుమార్, పద్మారావు, సాయిప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్, వినోద్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్, ఒక ఎంపీ సీటు మాదిగలకు ఇవ్వాలి

తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి


సమావేశంలో మాట్లాడుతున్న పోకల కిరణ్‌కుమార్‌మాదిగ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కంటోన్మెంట్ ఎమ్మెల్యే టికెట్‌తోపాటు వరంగల్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్‌లో ఏదో ఒక ఎంపీ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి కన్వీనర్ పోకల కిరణ్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కిరణ్‌కుమార్ మాదిగ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీలోపు కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని ప్రకటించాలన్నారు. మాదిగలకు టికెట్లు కేటాయించకపోతే 17 స్థానాల్లో మాదిగలను నిలబెట్టి కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జాతిని తాకట్టుపెట్టి బీజేపీకి మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల మహాకూటమి సమన్వయకర్త వళపాక నర్సింహమాదిగ, గ్యార శ్రీనివాస్, బీఎస్ రమేష్‌కుమార్, ప్రొఫెసర్ తిరుపతి, ప్రొఫెసర్ నతానియల్, తెలంగాణ మాదిగ సంక్షేమ సమితి అధ్యక్షుడు గడ్డ యాదయ్య, మహాఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు జి.నర్సింహ్మ, సలహాదారులు మాస్టర్‌జీ, రాజలింగం, లాయర్ మల్లన్న పాల్గొని ప్రసంగించారు.

మతరాజ్యం స్థాపించాలని కుట్రలు: వీరయ్య


సదస్సులో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో మతరాజ్యం స్థాపించాలని కుట్రలు చేస్తున్నారని, అదే జరిగితే మనుధర్మశాస్త్రమే రాజ్యాంగం అవుతుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎస్.వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ ఆధ్వర్యంలో 'బీజేపీని ఓడిద్దాం-నియంతృత్వ ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడుకుందాం'అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ మతరాజ్యం వస్తే ప్రశ్నించే అవకాశం కూడా ఉండదన్నారు. ప్రధాని మోదీ సహకారంతో బడా పారిశ్రామికవేత్తలు అదానీ, అంబానీలు, టాటా, బిర్లాలే దేశాన్ని శాసిస్తున్నారని అన్నారు. బీజేపీ ఎన్ని కోట్ల రూపాయలు అడిగినా ఇస్తున్నారని, కానీ ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చినవారిలో అదానీ, అంబానీ కంపెనీలు లేవని ఆరోపించారు. ఈ బడా బాబులకు మోదీ బాగా నచ్చాడని, అందుకే రాజకీయ ప్రయోజనాలు, ఓట్ల కోసం మతాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహారావు, గ్రేటర్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నేతలు శ్రీనివాసరావు, ఎం.వెంకటేష్, మహేందర్, ఎం.దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాలు.. వలసలు

- కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఎస్‌పీ నేతలు
- బీఆర్ఎస్‌కు సీనియర్ నేత సోమన్ రాజీనామా
- ముషీరాబాద్ పరిధిలో వలసల పర్వం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మారిన రాజకీయ సమీకరణలు


కాంగ్రెస్‌లో చేరుతున్న బీఎస్‌పీ, ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు

ముషీరాబాద్: పార్లమెంటు ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ముషీరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయి. దీంతో ఒక్కసారిగా ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. ఆయా పార్టీలలోని అసమ్మతి నేతలు తమకు నచ్చిన పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. దీంతో ఆయా పార్టీలలోకి వలసలు జోరందుకున్నాయి. దీనికి తోడు రాజీనామాలు కూడా మొదలైయ్యాయి.

కాంగ్రెస్‌లో చేరిన బీఎస్‌పీ నేతలు..

ముషీరాబాద్ బీఎస్‌పీ నేత పోచగారి సరేందర్ తన అనుచరులతో కలిసి సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పార్టీ నేత రోహిణ్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో రాష్ట్ర మహిళా కన్వీనర్ పుట్టల శైలజ, ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు పరమేశ్వర్, ఉపాధ్యక్షులు రహీం, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు విశ్వనాథ్ మహరాజ్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు నరసింహ, ఆమ్ ఆద్మీ పార్టీ నేత అయూబ్, రాంనగర్ డివిజన్ నేత దుర్గా ప్రసాద్, బాగ్‌లింగంపల్లి నేత రవీందర్‌రెడ్డి, రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్.రవితో పాటు క్రాంతికుమార్, నసీరుద్దీన్, అజయ్ ఉన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్..


బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన సోమన్

ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నేత టి.సోమన్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పార్టీలో సరైన గుర్తింపు, ఆదరణ లేక మనస్తాపానికి గురై పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. పదేళ్లుగా పార్టీలో కొనసాగుతూ ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశానని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేశానని తెలిపారు. కరోనా సమయంలో రెండేళ్లపాటు పేదలకు నిత్యావసర వస్తువులను, మందులను పంపిణీ చేశానని, పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశానని తెలిపారు. అయినప్పటికి బీఆర్ఎస్‌లో సరైన గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ టికెట్ కేటాయింపులోనూ తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పదవుల నియామకాల్లోనూ ప్రాధాన్యమివ్వలేదన్నారు. త్వరలో తన రాజకీయ భవిష్యత్తును వెల్లడిస్తానని సోమన్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేత పండరినాథ్ మృతి


పండరీనాథ్ (ఫైల్‌ఫోటో)

ముషీరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, భోలక్‌పూర్ సీనియర్ నాయకుడు కె.ఎల్.పండరినాథ్ పాండు(72) సోమవారం అనారోగ్యంతో భోలక్‌పూర్‌లోని తన నివాసంలో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, సీనియర్ నేతలు బింగి నవీన్, బీజేపీ నేత ప్రఫుల్ రాంరెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. పండరినాథ్ అంత్యక్రియలు భోలక్‌పూర్‌లోని హిందూ శ్మశానవాటికలో నిర్వహించారు.

సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డిదే గెలుపు


పరశురాములు

కవాడిగూడ: సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో మరోసారి కిషన్‌రెడ్డి గెలువబోతున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా ముషీరాబాద్ కన్వీనర్ పరశురాములు అన్నారు. సోమవారం ఆయన ఇందిరాపార్కు వద్ద విలేకరులతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితులలో సికింద్రాబాద్ పార్లమెంటు ప్రజలు లేరన్నారు. బీజేపీ దేశవ్యాప్తంగా 400లకు పైగా పార్లమెంటు స్థానాల కోసం ప్రయత్నం చేస్తుంటే కాంగ్రెస్ 40 సీట్లకోసం ప్రయత్నిస్తోందన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలి

కాచిగూడ: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేపడుతున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై వెంటనే తగినచర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని బీసీ కార్యాలయంలో బీసీ విద్యార్థి సంఘం కార్యదర్శి సదవారి నిఖిల్ పటేల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ర్యాంకుల పేరుతో, హంగూ ఆర్బాటలతో ప్రచారం చేపడుతూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నాయని, అలాంటి కళాశాలలను గుర్తించి వాటి పర్మిషన్ రద్దు చేయాలని అన్నారు. కార్పొరేట్ కళాశాలల అక్రమాలకు కొమ్ముకాస్తున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓబీసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా రేణుక


నియామకపత్రాన్ని అందజేస్తున్న భాగ్యలక్ష్మీ

కాచిగూడ: ఓబీసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా పండుగ రేణుక ముదిరాజ్‌ను నియమిస్తూ నియామకపుపత్రాన్ని ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మీ సోమవారం కాచిగూడలోని కార్యాలయంలో అందజేశారు. సామాజిక పరివర్తనకు మహిళలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓబీసీ సెంట్రల్ కమిటీ బీజేపీకి మద్దతుగా ప్రచారం నిర్వహించాలని తీర్మానించినట్లు ఆమె తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించాలని కోరారు.

బడ్జెట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ట్రస్మా నేతలు

సీఎంకు ట్రస్మా వినతి

కవాడిగూడ: రాష్ట్రంలోని బడ్జెట్ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మెనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కందాల పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డిల నేతృత్వంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యను వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలలను కూడా అదే దృష్టితో చూడటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా కోశాధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి చింతల రాంచందర్, పీజే రెడ్డి, ఎస్.శేఖర్‌రెడ్డి, కె.అనిల్ కుమార్, ఎం.నాగయ్య, ఎం.లింగారెడ్డి, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, బి.రాఘవా, కె. రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరామ జెండాల పంపిణీ


జైస్వాల్ గార్డెన్‌లో జెండాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ ముదిరాజ్

అంబర్‌పేట: శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని గోల్నాక జైస్వాల్ గార్డెన్ రెసిడెన్సీ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. అందులో భాగంగా సోమవారం కాలనీలో ఇంటింటికీ కాషాయ జెండాలను ఆయన పంపిణీ చేశారు. శ్రీరామ నవమి పండుగ వాతావరణం ఉట్టిపడేలా కాలనీల్లో ఈ నెల 17న నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్‌చారి, వినోద్, అనూప్, విజ్ఞేష్, సుదర్శన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు..

బాగ్ అంబర్‌పేట్‌లో...

బీజేపీ డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ శ్రీరామ నవమి జెండా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దత్తు ముదిరాజ్, రోహిత్‌రాజ్‌గౌడ్, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి వైస్ చైర్మన్ లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు ఆనంద్‌గౌడ్, గణేష్, బి.వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేసే కవిత్వం రావాలి


లక్ష్మీనారాయణ రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజలను చైతన్యవంతం చేసే కవిత్వం రావాలని ప్రముఖ సాహితీవేత్త, అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుర్రా లక్ష్మినారాయణ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన రచించిన 'నాలుగు కుంజీలు కథలు', 'ఇదీ వరుస', 'ఎన్నెల మొగ్గలు'పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ కవిత్వం అనేది ప్రజలను కదిలించే విధంగా ఉండాలన్నారు. సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో లక్ష్మినారాయణ పుస్తకాలు రాయడం అభినందనీయమని చెప్పారు. ఆయన భౌతికంగా లేకపోయిన ఆయన సాహిత్యం కలకాలం ఉంటుందన్నారు. డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేతలు కె.వి.ఎస్.వర్మ, ఎం.నారాయణశర్మ, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, గుడిపాటి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ అందిద్దాం


అంబర్‌పేట డివిజన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. సోమవారం జరిగిన అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట డివిజన్‌ల బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో అంబర్‌పేట నుంచి పద్మారావుగౌడ్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్‌లు విజయకుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి, సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, డివిజన్‌ల అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, చంద్రమోహన్, నాయకులు జాఫర్‌లతోపాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వేసవి సంగీత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో వేసవి భక్తి సంగీత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 22 నుంచి మే 24వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌ల్లో శిక్షణ ఉంటుందని మ్యూజిక్ అకాడమి డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 83749 27736 నంబర్‌లో సంప్రదించవచ్చు.

నియామకం


సాయినితీష్ గౌడ్

నల్లకుంట: కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జిగా నల్లకుంటకు చెందిన టీపీసీసీ ఓబీసీ విభాగం స్టేట్ కో ఆర్డినేటర్ ఎం.సాయి నితీష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు.

బతుకమ్మ కుంటలో కార్డన్ సెర్చ్

అంబర్‌పేట: పోలీసులు బస్తీని జల్లెడ పట్టారు. ఇల్లిల్లు గాలించి అక్రమ వాహనాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారంరాత్రి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బతుకమ్మ కుంటలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఏసీపీ రఘు నేతృత్వంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వస్తువులు, వాహనాలు, వ్యక్తులను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలులేని 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్ఐ విజయ్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు బూత్‌స్థాయిలో కృషి


మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట: పోలింగ్ బూత్‌స్థాయిలో బీజేపీ గెలుపునకు కృషి చేస్తామని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ 145వ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో మెజార్టీ వచ్చేలా బూత్ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీరప్ప, ఈశ్వర్, పులి నారాయణ, రామేశ్, శ్రీనివాస్, దిలిప్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రం, చలివేంద్రం పరిశీలన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతావాకర్స్ క్లబ్ నల్లకుంట, ఆదర్శ్ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ, చలివేంద్రం కేంద్రాన్ని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ బట్టాడ్, రీజినల్ కౌన్సిలర్ లక్ష్మేంద్రచారి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి పేదలకు అండగా ఉండాలని కోరారు. వీఎస్‌టీ రోడ్‌లోని కట్టమైసమ్మ దేవాలయం వద్ద ఉదయం 9 నుంచి 4 గంటల వరకు మజ్జిగ వితరణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాతావాకర్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ వై.మురళీధరుడు, ఉపాధ్యక్షులు వెంకట్, నీలా శ్రీధర్, మారం సురేష్‌బాబు, కోశాధికారి కోనేరు జైహింద్, ముఖ్య సలహాదారులు రామలింగేశ్వర్‌రావు, శరత్‌కుమార్, కేశవ్‌రావు దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో 'విజయసంకల్ప అభియాన్'


విజయ సంకల్ప అభియాన్‌లో కరపత్రం ఇస్తున్న లక్ష్మణ్, వినయ్‌కుమార్

చిక్కడపల్లి: దేశ అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోదీ విశేషంగా కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం గాంధీనగర్‌లో చేపట్టిన విజయ సంకల్ప అభియాన్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాసంక్షేమానికి మోదీ పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రజలు మరోసారి మోదీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నేతలు డీఎస్ రెడ్డి, సురేష్, సుబ్బారావు, గిరి ఎంవీఆర్ ప్రసాద్, వసంత్‌రావు, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కవులు మానసిక రుగ్మతలను నివారిస్తారు

చిక్కడపల్లి: సాంస్కృతిక, సాంఘిక సేవాసంస్థ రాగసప్తస్వరమ్, సీల్‌వెల్ కార్పొరేషన్‌ల సంయుక్తాఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో ఉగాది పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. న్యూక్లియర్ వైద్యవిధానంలో ప్రతిభాశాలి డాక్టర్ జ్యోత్స్నకు పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా దూరదర్శన్ రిటైర్డ్ డీజీ అనంతపద్మనాభారావు మాట్లాడుతూ వైద్యులు శారీరక ఆరోగ్యాన్ని నయం చేస్తే కవులు మానసిక రుగ్మతలను నివారిస్తారన్నారు. ప్రముఖులు సర్వ మంగళగౌరి, శ్రీమణి, అరుణ, కుసుమ, కాంతికృష్ణ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వైకే నాగేశ్వర్‌రావు పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: వైకే నాగేశ్వర్‌రావు ఎంతో మంది కళాకారులను ప్రోత్సహించారని రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు సారథ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో దివంగత వైకే నాగేశ్వర్‌రావు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైకే నాగేశ్వర్‌రావు స్మారక పురస్కారాలను పలువురు ప్రముఖులకు రమణాచారి ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖులు మధుసూదన్‌రావు, ఆర్‌కే మూర్తి, సంజయ్‌కిషోర్, భార్గవి, జి.వెంకట్, చెన్నయ్య, అంజిబాబు, కేపీ కృష్ణకుమారి, రఫీ, లంకా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో నగలు, నగదు చోరీ

కాచిగూడ: బంగారు అభరణాలు, నగదు దొంగతనం జరిగిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... చిత్తూరులోని శాంతినగర్ కాలనీ ప్రాంతానికి చెందిన సుబ్రమణ్యం భార్య భువన (55) కాచిగూడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-1లో రైలు దిగి కుటుంబ సభ్యుల కోసం వేచిచూస్తోంది. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు భువన బ్యాగులో ఉన్న 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.6 వేల నగదు, ఖరీదైన సెల్‌ఫోన్ తీసుకొని పారిపోయారు. బాధితురాలి పిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.